ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్

పంచాయతీ కార్యదర్శులందరికీ స్థానచలనం

- మొదట ప్రభుత్వ జీవో ప్రకారం 40 శాతం మంది బదిలీకే కసరత్తు
- ఆ తర్వాత అందరినీ బదిలీ చేయాలని కలెక్టర్ నిర్ణయం
- అవాక్కయిన కార్యదర్శులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ శాఖలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల్లో నలుగు రైదుగురు మినహా అందరికీ స్థాన చలనం కల్పించి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంచలనం సృష్టించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లా పంచాయతీ కార్యదర్శి బదిలీల కోసం మొదట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కసరత్తు చేపట్టారు. అయితే జిల్లాలో చాలా మంది కార్యదర్శులు దీర్ఘకాలికంగా ఒకేచోట పని చేస్తున్నారని గమనించిన కలెక్టర్ అందరినీ బదిలీ చేయాలని సంచలన నిర్ణయం తీసుకోవడంతో కార్యదర్శులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

ఈ నెల 18వ తేదీన జాబితాలను సిద్ధం చేసి 19న రాత్రి 8:30 గంటల వరకు కలెక్టరేట్‌లో గ్రామ కార్యదర్శులందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఇతర మండలాలకు బదిలీ చేశారు. ఒక మండలంలో పనిచేసిన కార్యదర్శిని అదే మండలంలో కాకుండా ఇతర మండలానికి బదిలీ చేయడం గమనార్హం. రాష్ట్రంలో సాధారణ బదిలీలు చివరిసారిగా 2018లో జరిగాయి. వాస్తవానికి ఉద్యోగుల సాధారణ బదిలీలను ఏడాదికోసారి గానీ, రెండేళ్లకోసారి గానీ చేపట్టాల్సి ఉంటుంది.



బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన పంచాయతీ కార్యదర్శులు

గత ప్రభుత్వ హయాంలో ఆ ప్రకారం చేపట్టకపోవడంతో చాలామంది ఉద్యోగులు ఒకేచోట పనిచేయాల్సి వస్తున్నది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయా శాఖల్లో బదిలీల ప్రక్రియ చేపట్టారు. గరిష్టంగా బదిలీల శాతాన్ని 20 శాతం నుంచి 40 శాతానికి పెంచారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కాగా, నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరి కోటాను అనుసరించి బదిలీ చేయాలని పేర్కొన్నారు. ఆ మేరకు జిల్లాలోని ఆయా శాఖల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జిల్లాస్థాయిలో, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు జోనల్ స్థాయిలో, గెజిటెడ్ అధికారులు మల్టీజోనల్ స్థాయిలో బదిలీలు జరుగుతున్నాయి. అయితే జిల్లాలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి 260 మంది కార్యదర్శులను ఒకేసారి బదిలీ చేశారు. ఇందులో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కార్యదర్శులతో పాటు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను కూడా బదిలీ చేయడం గమనార్హం. జీవో 317లో భాగంగా ఇతర జిల్లాల నుంచి పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వచ్చిన కార్యదర్శులను కూడా బదిలీ చేశారు. మొదట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత వచ్చిన దరఖాస్తులను, తప్పనిసరి బదిలీల జాబితాను రూపొందించి జీవోను అనుసరించి 40 శాతం మందిని బదిలీ చేసేందుకు ఈ నెల 17న కసరత్తు చేసి కలెక్టర్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయమై కలెక్టర్ అందరినీ బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఆ మేరకు అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారిని, స్పౌస్ కేటగిరీకి చెందిన వారి పేర్లను మొదట చేర్చి ఆ తర్వాత సీనియారిటీని బట్టి జాబితాను రూపొందించారు. ఆ ప్రకారం 19న సాయంత్రం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 40 శాతానికి మించి బదిలీ చేయడంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. 40 శాతం మంది కార్యదర్శులనే బదిలీ చేసేందుకు కసరత్తు చేసిన అధికారులు అందరినీ బదిలీ చేయాలని ఆకస్మిక నిర్ణయం వెనుక ఏం జరిగి ఉంటుందనే చర్చ జరుగుతున్నది. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ కార్యదర్శులందరికీ స్థాన కల్పించారా లేక ప్రభుత్వం ఏమైనా అంతర్గతంగా తీసుకున్న నిర్ణయం మేరకు మొత్తం కార్యదర్శులను బదిలీ చేశారా అనే విషయం కార్యదర్శుల్లో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఆయా జిల్లాల్లో 40 శాతం మాత్రమే బదిలీలు జరిగితే ఇక్కడ ఎందుకు మొత్తం మందిని బదిలీ చేశారనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మొత్తం మీద పంచాయతీ కార్యదర్శుల్లో నలుగురైదుగురు మినహా అందరినీ కలెక్టర్ బదిలీ చేసి సంచలనం సృష్టించారనే చర్చ జరుగుతున్నది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' కలెక్టర్ శ్రీహర్షను ఫోన్‌లో సంప్రదించగా పాలనా సౌలభ్యం దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులను అందరినీ బదిలీ చేశామని పేర్కొన్నారు.

ఏసీడీపీ పనులపై ఆడిట్ కొరడా

- నిబంధనలకు విరుద్ధంగా విడుదలైన నిధుల రికవరీకి ఆదేశాలు
- ఎన్నికల ముందు అడ్డగోలుగా ఏసీడీపీ కేటాయింపులు
- నిబంధనలు గాలికి... గుడ్డిగా ప్రొసీడింగ్‌లు

7



రికవరీకి ఆదేశించిన డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ భవనం

అప్పు చెల్లించమన్నందుకు మహిళ హత్య

- మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి బావిలో వేసిన నిందితులు
- హత్యలో పాల్గొన్న ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

7

ఎడతెరిపి లేని వాన

- రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు రోజుల్లో 11సెంటీమీటర్ల వర్షపాతం
- వరదతో నిండిన ఫైవింక్లయిన్ మోరీ రహదారి

8



వరదతో నిండిన ఫైవింక్లయిన్ మోరీ రహదారి

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ ఆర్ కృష్ణ

పెద్దపల్లిటౌన్, జూలై 20: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు, గురువులు చూపిన మార్గంలో నడుచుకోవాలని సీఐ ఆర్ కృష్ణ సూచించారు. డ్రగ్స్ వద్దు ప్రాణం ముద్దు అనే నినాదంతో గంజాయి, మాదకద్రవ్యాలపై స్థానిక గాయత్రి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. గంజాయి తదితర మాదకద్రవ్యాలు సేవిస్తే కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, విద్యార్థులు గంజాయి మాదకద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కావద్దని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలలు సాకారం చేసుకోవాలన్నారు. ప్రతీవిద్యార్థి లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా సాధించుకునేందుకు కృషి చేయాలన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాకలో ప్రభుత్వ విప్ 'అడ్లూరి' పర్యటన

- జ్వర బాధితులకు పరామర్శ - పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన





జ్వర బాధితులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గ్రామంలో పర్యటిస్తున్న అడ్లూరి

ధర్మారం, జూలై 20: ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న ప్రజలను శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. గ్రామంలోని అన్ని వాడల్లో వర్షంలో వైద్య సిబ్బం దితో కలిసి ఆయన పర్యటించి జ్వర బాధితులతో మాట్లాడారు. జ్వరం వచ్చిందని ఎవరు ఆందోళన చెందవద్దని ఆయన కోరారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల వైద్య సహాయం అందుతుందని వారికి భరోసా కల్పించారు. అదేవిధంగా గ్రామం లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగినచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

● మెగా క్యాంపు నిర్వహించాలని కలెక్టర్‌కు సూచన

పత్తిపాక గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో మంగళవారం గ్రామంలో ప్రత్యేక మెగా క్యాంపు నిర్వహించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలెక్టర్‌కు సూచించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి వారికి వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. స్థానిక వైద్యులు అందుబాటులో ఉన్నారని జిల్లా నుంచి ప్రత్యేక వైద్యులను రప్పించేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, డాక్టర్ సుష్మిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం సుజాత, సింగిల్‌విండో ఛైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ రూప్లానాయక్ ఉన్నారు.

● గ్రామంలోనే వైద్య బృందం..

జ్వరాలతో బాధపడుతున్న వారికి నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం గ్రామంలో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రతీఇంటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులను అందిస్తున్నారు. అదేవిధంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్యాధికారి సేష్మిత, డాక్టర్ గౌతమ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, జూలై 20: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మంథని నియోజకవర్గ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పా టించాలి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ప్రజలకు సూచిం చారు. రెండు జిల్లాలో భారీ వర్షాలు వరద నీటి ప్రవాహాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉండి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇళ్లలో ఉండే వారు తగిన జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. వాగులు చెరువుల నీరుచేరే అవకాశం ఉన్న లోతట్టు గ్రామాల ప్రాంత ప్రజలను గుర్తించి వారిని సురక్షిత ప్రదేశాలకు అధికారులు వెంటనే తరలించాలని, ప్రజలకు ఇలాంటి ముప్పు రాకుండా తగిన జాగ్రత్తలతో సౌకర్యా లు కల్పించాలని కోరారు. నీటి ప్రవాహం ఉన్నచోట రాకపోకలపై దృష్టి సారించా లని తెలిపారు. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట జాగ్రత్త వహించా లని, ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉన్నచోట విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు తగిన సూచనలు అందించాలన్నారు. గోదావరినది పరివాహక ప్రాంతాల్లో, కాలువలు చెరువుల ప్రాంతాల్లో పశువులను, మేకలను మేపడానికి, చేపలు వేటకు గాని ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్త కుండా పోలీస్‌శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. వర్షాలకు కల్వర్టు, చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహి స్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయవద్దని కోరారు. గోదావరి నది, వాగుల పరివాహక గ్రామ ప్రజలు, పిల్లలు, యువకులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈతలు కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు పూర్తి దృష్టి సారించాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో గోదావరి పరివాహక ప్రాంతాలలో వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులు అలాంటి చెరువులు కాలువలను గుర్తించి వెంటనే ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శంకర్

కాల్వశ్రీరాంపూర్, జూలై 20: కాల్వ శ్రీరాంపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా శంకర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ధీరజ్ జూలపల్లికి బదిలీ కాగా కలెక్టరేట్ డీఎస్‌వో ఆఫీసులో డీటీసీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌ను కాల్వ శ్రీరాంపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తాం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 20: రాష్ట్రంలో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించి ఇళ్లు జాగ లేని పేద ప్రజలకు ఇళ్లను పంపిణీ చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 68 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 68 లక్షల ఏడు వేల 888 రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చిందని ఇది చేతల ప్రభుత్వమని అన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ అనంతం మరో వారంలో లక్షా యాభై వేల రూపాయల వరకు రుణమాఫీ అవుతుందన్నారు. త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం అవుతుందని ప్రతీ ఏడాది ఇది కొనసాగుతుందన్నారు. అవినీతికి తావులేకుండా సీఎం రేవంత్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ ఛైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు నిషాత్‌రఫీక్, చింతల సునీత రాజు, రాజయ్య, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, దామోదర్ రావు, పన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక గోరింటాకు వేడుక

రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్/కళ్యాణ్‌నగర్ జూలై 20: భారతీయ సంస్కృతి సంప్రదాయాలల్లో గోరింటాకుకు ప్రత్యేక స్థానం ఉందని రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. శనివారం గోదావరిఖని మార్కండేయకాలనీ గణేష్‌నగర్‌లో లక్ష్మీగణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో గోరింటాకు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాధిగా వస్తున్న ఆచారమన్నారు. వర్షాకాలంలో క్రిమి కీటకాలు, అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉందని గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఇన్‌ఫెక్షన్లు దరిచేరకుండా గోరింటాకు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో గుర్రం వీణ, సత్యవతి, శ్రీదేవి, రమాదేవి, వినోద, శ్రీలత, సౌజన్య, శశిరేఖ, పద్మజ, హారిక, కళ్యాణి, సునీత, ఉమ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో వైద్య శిబిరం

ఓదెల, జూలై 20: మండల కేంద్రంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో జ్వర పీడుతులను పరిశీలిస్తూ తగిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి షహబాజ్‌ఖాన్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్ల జలుబు, వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. అలాగే జ్వరాలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని గ్రామంలో ఉన్న వైద్య సిబ్బందిని గాని సంప్రదించి తగిన వైద్యం చేయించుకోవాలని వైద్యాధికారి కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్వర బాధితుడితో మాట్లాడుతున్న వైద్యాధికారి

విద్యార్థులు సెల్‌ఫోన్లను దూరంగా ఉండాలి

- జిల్లా విద్యాధికారి మాధవి

ఓదెల, జూలై 20: విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. మండలంలోని పొత్కపల్లి, హరిపురం, ఓదెల, మడక పాఠశాలల్లో శనివారం డీఈవో మాధవి తనిఖీలు నిర్వహించారు. అనంతరం మడక యూపీఎస్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో డీఈవో మాట్లాడుతూ, విద్య మానవ వికాసానికి, సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులు పెద్దల పట్ల గౌరవం, క్రమశిక్షణతో ఉండాలని, సమయపాలన పాటిస్తు పాఠశాలలకు హాజరుకావాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ ఇంటిలో ఒక స్టడీ రూమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ఉపాధ్యాయులు పరిశీలన నిర్వహించాలని కోరారు. అలాగే ఇళ్లలో విద్యార్థి చదువుకునే విధంగా మంచి వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులను కోరారు. టీవీలకు సెల్ ఫోన్ లకు విద్యార్థులు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందనీ, అదేవిధంగా ప్రతిరోజు తమ పిల్లలను తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు. అనంతరం ఎంఈవో రాజయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ తమ విధులకు హాజరు కావాలని కోరారు. అలాగే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని, ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని, గైర్హాజరు అయ్యే విద్యార్థుల వద్దకు వెళ్లి కారణాలను తెలుసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు డీఈవో బెల్టులు, టైలు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ సరోజన, హెచ్ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు సరోజన, సత్యనారాయణ, సిద్దయ్య, రమాదేవి, సుహాసిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో మాధవి

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- ఒక్కరోజు దీక్షకు పలువురు నాయకుల మద్దతు

సిరిసిల్ల రూరల్, జూలై 20: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు అసాములు, కార్మికులకు ఉపాధి కల్పించి విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయం ఎదుట శనివారం భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక రోజు దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులకు చేనేత వస్త్ర వ్యాపార సంఘం పాలిస్టర్ వస్త్ర ఉత్ప త్తిదారుల సంఘం, కాటన్ ఉత్పత్తి దారుల సంఘం, అసాముల సమన్వయ కమిటీ సంఘం, డైయింగ్ అసాముల సంఘం నాయకులు దీక్ష శిబిరాన్ని సంద ర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ మనుగడ కోసం ఉచిత విద్యుత్ కావాలని, అలాగే మరమగ్గాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇ వ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీతో పాటు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వర్కర్‌టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మరమగ్గాల పరిశ్రమకు సంబంధించిన కరెంట్ పాత బకాయిలను మాఫీ చేయడంతో పాటు బతుకమ్మ చీరలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొత్త అర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంతో పాటు నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలని కోరారు. సిరిసిల్లలో ఎనిమిది నెలలుగా ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడ్డ కార్మిక కుటుంబా లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండ నరేష్, మోర రవి, గాజుల సదానందం, కోడం అనంద్ బాబు, దుమాల శ్రీకాంత్, గాజుల వేణు, మేర్గు శ్రీనివాస్, కోడం రవి, సుంచు ప్రకాష్, కోడం శ్రీనివాస్, తవుటు రాజలింగం, వడ్నా ల శ్రీకాంత్, వేముల రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

జమ్మికుంట రూరల్, జూలై 20: రవాణా రంగ కార్మికుల సమస్యలపై మంగళవారం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. జమ్మికుంటలో శనివారం 200మంది ట్రాలీ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా పున్నం రవి వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు రవాణ రంగ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు కార్మికులకు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డిజిల్, ఇన్సూరెన్స్, ఫిటెనెస్ ధరలు తగ్గించాలన్నారు. ఐదు లక్షల ప్రమాద బీమా ఏ షరతు లేకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల ముకుందా లాల్ మిశ్రా సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెలికాని శ్రీనివాస్, మౌటం రఘు, ప్రధాన కార్యదర్శి పూలవేన కుమార్, పర్లపల్లి పవన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడ్డ నక్కలు

- సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు


అధికారులు బయటకు తీసిన నక్క

కథలాపూర్, జూలై 20: మండలంలోని బొమ్మెనలో శనివారం ఓ రైతు బావిలో రెండు నక్కలు పడ్డాయి. రైతు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొడిమ్యాల డిప్యూటీ రేంజ్ అధికారి ముషీర్ అహ్మద్ నేతృత్వంలో నక్కలను సురక్షితంగా బయటకు తీశారు. బీట్ అధికారి మధుసూదన్, వాచర్లు గంగాధర్, ఎర్రయ్య, నల్లగొండం స్థానిక రైతులతో కలిసి వలల సహాయంతో బయటకు తీసి ఫారెస్ట్‌లోకి వదిలి పెట్టారు. దీంతో సమీప అడవుల్లోకి పరుగులు పెట్టాయి.

రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీ

- త్వరలో సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం?

కరీంనగర్ క్రైం, జూలై 20: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో 46 మంది జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు షరాఫ్‌లు, 21 మంది అటెండర్లను బదిలీ చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని పలువురు సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు కూడా బదిలీలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌లు ఉండగా మిగతా 11 చోట్ల సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జి సబ్ రిజి స్ట్రార్లుగా పనిచేస్తు న్నారు. ఈ 11 చోట్ల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించే అవ కాశముంది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లున్న చోట్ల భారీఎత్తున అవినీతి జరుగుతున్నట్లు ఆరోప ణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియ మించి కార్యాలయాల్లో అవినీతి జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూలై 20: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పన్నాల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక అన్నపూర్ణ కాలనీకి చెందిన శ్రీనివాస్ గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మరణించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారైలు ఉన్నారు. ఎన్టీపీసీ పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య కార ణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

రెండు కార్లు ఢీ: నలుగురికి గాయాలు


కల్వర్టులోకి దూసుకు పోయిన కారు

సుల్తానాబాద్, జూలై 20: పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు రాజీవ్ రహదారి పక్కనున్న కల్వర్టులో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ నుంచి ఓ కుటుంబం వైద్య చికిత్స నిమిత్తం కరీం నగర్‌కు వెళ్లింది. తిరిగి శనివారం మహదేవ్‌పూర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో వారి కారు సుల్తానాబాద్ పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపం నుంచి వెళ్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ మార్గం లో వెళుతున్న మరో కారు యూటర్న్ తీసుకుంటూ వేగంగా ఢీకొ ట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన గల కల్వర్టులో పడి పోయింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురు షులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: యువకుడి మృతి


రాజేందర్(ఫైల్)

దండేపల్లి, జూలై 20: దండేపల్లి మండ లం కన్నెపల్లిలో సదానందయ్యా స్వామి ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఎదురె దురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువ కుడు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామా నికి చెందిన వేల్పాల రాజేందర్ (39) మండలంలోని గూడెం షిర్డీ సాయి బాబా ఆలయంలో కుటుంబ సమేతంగా పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి అత డితో పని చేసే పుల్లూరి నరేష్‌తో కలిసి బైక్‌పై లక్షెట్టిపేట వెళ్లారు. తిరిగి గూడెం ఆలయం వైపునకు వస్తుండగా గూడెం నుంచి లక్షెట్టిపేట కరీంనగర్ చౌరస్తా వైపునకు వేగంగా వచ్చిన బైక్ ఎదు రుగా వస్తున్న రాజేందర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేం దర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. రాజేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రా జేందర్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పాతకక్షలతో గొడ్డలితో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూలై 20: మండలంలోని దేవంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పాతకక్షలను దృష్టిలో పెటుకొని ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన యువకుడు, అతడి తండ్రి గొడ్డలతో దాడికి పా ల్పడ్డ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యా యి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవంపల్లి గ్రామానికి చెం దిన గాడిచర్ల తిరుపతి అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన గాడిచ ర్ల రాజు అనే వ్యక్తుల ఇళ్లు ప్రక్కపక్కనే ఉన్నాయి. ఇంటి వద్ద గ ల మూడు గజాల భూమి విషయంలో గతంలో గొడవలతో పం చాయతీ జరిగింది. కాగా శుక్రవారం రాత్రి గ్రామంలో వంశీ, గాడిచ ర్ల సాయికుమార్ అనే వ్యక్తులు ఒక్క దగ్గర ఉన్నాడు. ఆ సమయంలో గాడిచర్ల తిరుపతి వ్యక్తి గత పనిపై వెళుతూ రాత్రి అయింది ఇంటికి వెళ్లు అంటూ వంశీని మందలించినట్లు తెలిపా రు. దీంతో సాయికుమార్ పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని ఇంటికి వెళ్లి తండ్రి రాజుతో కలిసి గొడ్డలి పట్టుకొని అకస్మాత్తుగా తిరుప తి భుజం, వీపుపై మూడు చోట్ల దాడికి పాల్పడ్డారు. అనంతరం పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ తిరు పతిని కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి త రలించారు. తిరుపతి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీడీపీ పనులపై ఆడిట్ కొరడా



రికవరీకి ఆదేశించిన ఎల్ఐసీ ఏజెంట్ల భవనం

» నిబంధనలకు విరుద్ధంగా విడుదలైన నిధుల రికవరీకి ఆదేశాలు » ఎన్నికల ముందు అడ్డగోలుగా కేటాయింపులు

» నిబంధనలు గాలికి..గుడ్డిగా ప్రొసీడింగ్‌లు

కోల్‌సిటీ, జూలై 20: నియోజకవర్గాల అభివృద్ధి పనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై రాష్ట్ర ఆడిట్ విభాగం కొరడా ఝుళిపించింది. ఎన్నికలకు ముందు నిబంధనలను గాలికివదిలి ఇష్టారాజ్యంగా నిధులు కేటాయించడం, ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఎలాంటి హామీ పత్రాలు లేకుండా నిధులు ఇవ్వడాన్ని ఆడిట్ తప్పుపట్టింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్ ఏరియాలో జరిగిన రెండు పనులకు చెల్లించిన బిల్లుల రికవరీకి అకౌంటెంట్ జనరల్(ఆడిట్) ఆదేశాలు జారీ చేసింది. ఆడిట్ అభ్యంతరాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ప్రస్తుతం జరుగుతున్న పనులు, టెండర్ల దశలో ఉన్న పనులపై దృష్టి పెట్టింది. నిబంధనలు అమలు చేస్తేనే పనుల కేటాయింపులు ఉంటాయంటూ స్పష్టం చేస్తుంది. ఇప్పటికే నిధులే లేని నియోజకవర్గ అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఒక్కో పనికి ఐదారుసార్లు టెండర్లు పెట్టినా స్పందన కరువైంది.

● ఎన్నికల సమయంలో..

కొవిడ్‌తో రెండేళ్ల నియోజకవర్గ అభివృద్ధి పనులు (సీడీపీ) ఆపిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మూడు కోట్ల రూపాయలు కేటాయించింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరే షన్‌లోనే 116పనులకు కేటాయింపులు జరిగాయి. వీటిలో కుల సంఘాలు, కళా సంఘాలు, దేవాలయాల్లో మండపాలు, యు వజన సంఘాలు, గణపతి మండపాలు, వ్యాపారవర్గాల అసోసియేషన్లు, మహిళా సంఘాల భవనాల వరకు కేటాయింపులు చేశారు. ఇందులో కొన్ని పనులను మ హిళా సంఘాల పేర నామినేషన్లపై కేటాయించారు. పలు పనులకు టెండర్లు పెట్టారు. వీటిలో కొన్ని పనులు ప్రారం భం కాగా కొన్నింటికి టెండర్లు పూర్తయ్యాయి. మరో 30 పనులకు టెండర్ల దశలోనే ఆగిపోయాయి.

● కేటాయిపునకు సంబంధించి..

సీడీపీ నిధుల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ఈ నిధులను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు కేటాయించాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రైవేట్ సంస్థలకు కేటాయింపులు జరిగితే సదరు ఆస్తి, స్థలాలు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. రామగుండం నియోజకవర్గంలో నిధులు కేటాయించిన ప్రాంతాల్లో మెజార్టీగా భూముల సమస్య ఉంది.

● రెండు పనుల నిధులు..

రామగుండం అర్బన్‌లో సీడీపీ నిధులతో జరిగిన రెండు పనుల నిధుల రికవరీకి ఏజీ ఆడిట్ ఆదేశాలిచ్చింది. గోదావరి ఖని సప్తగిరికాలనీలో నిర్మాణం పూర్తయిన ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ భవనం, గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ భవనాల్లో జరిగిన చెల్లింపులను రికవరీ చేయాలంటూ చీఫ్ ప్లానింగ్ అధికారి రామగుండం కమిషనర్‌కు లేఖ పంపారు. ఇప్పటికే చెల్లింపులు జరిగిపోవడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ రికవరీలు జరిగితే పనుల సిఫార్సు చేసిన అధికారులు కూడా బాధ్యులయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం ఇందులో ముందస్తుగా నిబంధనల ప్రకారం వ్యవహరించలేదనే ఆరోపణలు న్నాయి. ఏజీ ఆడిట్ ఆదేశాలతో అప్రమత్తమైన సీపీఓ కార్యా లయం బిల్లుల చెల్లిం పులకు వెళుతున్న ఫైళ్లను తిప్పి పంపుతుంది. నిర్మాణాలు జరిగిన స్థలాలు ప్రభుత్వంది అయితేనే చెల్లింపులు చేస్తామని ఖరాఖండిగా పేర్కొంటోంది. ప్రభుత్వ, సింగరేణి స్థలాల్లో జరిగిన నిర్మాణాలకు ఓకే చెబుతున్న సీపీవో కార్యాలయం ప్రైవేట్ స్థలాల్లో జరిగిన నిర్మాణాల విషయంలో అభ్యంతరాలు చెబుతోంది. దీంతో పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు.

కొన్ని అసోసియేషన్లు, వ్యాపార సంఘాలు, కుల సంఘాలకు పట్టా భూములు ఉన్నాయి. వాటిని చందాల సొమ్ము పోగేసి కొనుగోలు చేశారు. ఈ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా లేరు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ అవసరాలకు వినియోగించు కునేలా పూర్తి స్థాయి హక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు చర్యలు తీసుకోకుండానే జిల్లా యంత్రాంగం ప్రొసీడింగ్‌లు జారీ చేసింది.

● ఆరు సార్లు టెండర్లు పెట్టినా..

ఏసీడీపీ నిధులను సాధారణంగా ప్రజా అవసరాలు తీర్చే పనులకు కేటాయింపులు చేస్తారు. మౌలిక వసతులు, తాగునీరు, పాఠశాలలు వంటి పనులకు కేటాయింపులు చేస్తారు. 20శాతం నుంచి 30శాతం మేర కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు కేటాయిస్తారు. ఎన్నికలకు ముందు జిల్లాలో దాదాపుగా మెజార్టీ కుల సంఘాలకు కేటాయింపులు చేశారు. రామగుండం నియోజకవర్గంలో ఒక్కో కుల సంఘానికి ఏరియాల వారీగా భవనాలకు నిధుల కేటాయింపులు చేశారు. ఇప్పుడు ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తం కావడం, నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 30 పనులకు ఐదారుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయడం లేదు.

● జిల్లా అంతటా ప్రభావం..

సీడీపీ పనులకు సంబంధించి నిబంధనలు కఠినతరం కావడంతో జిల్లాలో ఎన్నికలకు ముందు కేటాయించిన పనులపై ప్రభావం పడనున్నది. అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఎన్నికల వేళ జిల్లా అధికారులు కూడా ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ఇప్పుడు పనులు చేయించేందుకు అధికారులు వెనుకడుగు వేసున్నారు. సీపీవో కార్యాలయంలో నిబంధనల విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తున్నారు.

హుజూరాబాద్ ఆస్పత్రిలో వైద్యుల కొరత

- ఇటీవల ఏడుగురు బదిలీ.. వారి స్థానంలో వచ్చింది ముగ్గురే.. - ఇబ్బంది పడుతున్న ప్రజలు



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి

హుజూరాబాద్, జూలై 20: హుజూరాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఉన్న ఏరియా ఆస్పత్రిలో రెండ్రోజుల క్రితం సాధారణ బదిలీల్లో ఏడుగురు వైద్యులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ముగ్గురిని మాత్రమే నియమించారు. దీంతో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో ఏడు మండలాలకు ఒకటే ఏరియా ఆస్పత్రి ఉండడంతో అందులో డాక్టర్ల కొరత ఏర్పడింది. ఈ ఆస్పత్రిలో ప్రసవాలు, శస్త్ర చికిత్సలు విరివిగా జరిగేవి. గైనకాలజిస్టు డాక్టర్ వాణిలత, సివిల్ సర్జన్ శ్రీకాంత్‌రెడ్డి, పల్లవి, శ్రీనివాస్, మహిపాల్‌ను కరీంనగర్‌కు, డాక్టర్ ప్రత్యూషను పరకాల, డాక్టర్ అర్చనను వర్ధన్నపేటకు బదిలీ చేశారు. వీరి స్థానంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి గైనకాలజిస్టు వైద్యులుగా డాక్టర్ నిశ్చలరెడ్డి, పిల్లల వైద్యులుగా సుభాంగిని, జనరల్ మెడిసిన్ వైద్యుడి రాజేష్ వచ్చారు. సోమశేఖర్ అనే వైద్యుడు కూడా బదిలీ కానున్నట్లు తెలిసింది. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఏకైక సర్జన్‌గా ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సర్జన్ రాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యాధికారులు, కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

జగిత్యాలరూరల్, జూలై20: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తాళ్ల బుచ్చిమల్లు శనివారం ఉదయం వృత్తిరీత్యా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాయ్యాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, జూలై 20: ఓ కాంట్రాక్టు పనిలో వ్యాపార భాగస్వామిగా చేర్చుకుంటామని రూ.82లక్షలు తీసుకొని మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఇచ్చిన డబ్బులు అడిగితే మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రాజు అనే వ్యక్తులు తనని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఆబాది జమ్మికుంటకు చెందిన బాసని పాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా తాను ఎవరి దగ్గర డబ్బులు తీసుకోలేదని చెప్పారు. తనకు చెడ్డ పేరు తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

పాలకుర్తి, జూలై 20: బసంత్‌నగర్ పోలిస్టేషన్ పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌ల పై అను మానాస్పదంగా కనిపించారని చెప్పారు. అదుపులోకి తీసుకొని విచారించగా రామగుండం గ్రామానికి చెందిన బానోత్ రమేష్ , గుగులోత్ రాజేష్‌నాయక్, ఈసాల తక్కళ్లపల్లికి చెందిన గాలిపెల్లి నిఖిల్ గంజాయిని తోకల సిద్ధార్థ నుంచి కొనుగోలు చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. సుమారు 242 గ్రాముల గంజాయి , రెండు బైకులు, సెల్ ఫోన్‌లు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రై, జూలై 20: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మానకొండూర్ నూతన సీఐగా జి సదన్‌కుమార్‌ను నియామకం చేయగా ఇప్పటి వరకు మానకొండూర్ సీఐగా పనిచేస్తున్న ఎం రాజ్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్వర్లుల్లో పేర్కొన్నారు. ఈనెల 6న మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సదన్‌కుమార్‌ను మానకొండూర్ సీఐగా, రాజ్‌కుమార్‌ను రామగుండంలో కమిషనరేట్‌లోని మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మానకొండూర్ సీఐగా సదన్‌కుమార్‌ను నియామకం చేస్తూ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?



డి90 కాలువలో మొక్కలు

చొప్పదండి, జూలై 20: చొప్పదండి మండలంలో పంటకాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. డి88, డి90 కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చి చెట్లతో నిండిపోయాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో డి83 నుంచి 90 వరకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉండగా డి83, డి86 కాలువలు పెద్దపల్లి జిల్లాకు నీటిని సరఫరా చేస్తారు. మిగతా కాలువల ద్వారా మండల పరిధిలో వ్యవసాయ భూములకు నీరు అందుతుంది. అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

- ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రాక పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి శనివారం ప్రస్తుతం 17.662 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 28.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 12.163 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.021 టీఎంసీల నీటిని వివిధ అవస రాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

ధర్మపురి వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి



ధర్మపురి వద్ద పారుతున్న గోదావరి

ధర్మపురి, జూలై 20: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం శనివారం స్వల్పంగా పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసి న వర్షాలకు ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు సంబం ధించిన 8, 9, 11 వ నెంబర్ గేట్లు ఎత్తి వేశారు. సాయంత్రం 6-30 గంటల వరకు అధికారులు గోదావ రి దిగువకు 11,016 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ వైపు ఉన్న సత్యవతి గుండం నుంచి దిగువ రాయపట్నం వైపు వరద ప్రవాహం కొనసాగుతోంది. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. వాగు దాటి అటు వైపు వెళ్లలేని పరిస్థితి ఉంది. చిన్న గద్దె నీటిలో మునిగిపోగా, మంచి నీటి బావి చుట్టూ ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. గోదావరి వరద పరిస్థితి గురించి ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గోదావరి నదీ పరిసర గ్రామాలైన ఆరెపల్లి, దొంతాపూర్, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లను గోదావరి నదీ వైపు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూలై 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ క్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అద్దాల మండపంలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆ యనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

కరీంనగర్ జైలును సందర్శించిన న్యాయసేవాధికార కార్యదర్శి

కరీంనగర్ క్రైం, జూలై 20: కరీంనగర్ జిల్లా జైలును శనివారం కరీంనగర్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయ సేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరి, వంటశాల, జైలు ఇండస్ట్రీలలో పనితీరు బాగా జరుగుతుందని అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ పోక్సో యాక్టు, ఎన్‌డీపీఎస్, మోటార్‌వెహికల్ యాక్టు, సీనియర్ సిటిజన్ యాక్టు, 498-ఎ యాక్టు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును కూడా సందర్శించి మహిళా ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసు వివరాలను, బాగోగులను, జైలులో వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు ప్రవేట్ లా యరును పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కే శ్రీనివాస్, జైలర్స్ పి శ్రీనివాస్, బి రమేశ్, డిప్యూటీ జైలర్స్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎం సుధాకర్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించమన్నందుకు మహిళ హత్య

- మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి బావిలో వేసిన నిందితులు
- హత్యలో పాల్గొన్న ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్

మంథని, జూలై 20: తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వమని అడినందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెరుక రాజేశ్వరి(65) అనే మహిళను అదే గ్రామానికి చెందిన అమ్ము రజిత అలియాస్ లావణ్య, భర్త రవి అలియాస్ రమేష్, కుక్కముడి తిరుపతి ఈనెల 5న హత్య చేశారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. మంథని పోలీసు స్టేషన్‌కార్యాలయంలో రాజేశ్వరి హత్యకు సంబంధించిన వివరాలను గోదావరిఖని ఏసీపీ రమేశ్ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లావణ్య తన ఇంటి సమీపంలోని పెరక రాజేశ్వరి వద్ద లక్షా యాభై వేల రూపాయలు అప్పుగా తీసుకుంది. రాజేశ్వరి తరుచూ అప్పు డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగేది. దీంతో ఆగ్రహించిన లావణ్య ఈనెల 5వ తేదీన అప్పు ఇస్తానని రాజేశ్వరిని ఇంటికి పిలిచింది. అనంతరం భర్త రవి, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతితో కలిసి ఇంట్లో గొంతు నులిమి చంపారు. అదే రోజు రాత్రి మృతురాలి ఒంటి ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని గొనె సంచిలో మూట కట్టి పారుపల్లి శివారులోని వ్యవసాయ బావిలో వేశారు. అనంతరం బంగారు ఆభరణాలను వరంగల్‌లో విక్రయించారు. అనంతరం 8వ తేదీన స్థానికులు వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను బయటకు తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. 14వ తేదీన మృతదేహం పెరుక రాజేశ్వరిదిగా గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టగా ముత్తారం గ్రామానికి చెందిన లావణ్య లక్షా యాభై వేల రూపాయలు మృతురాలు రాజేశ్వరి వద్ద అప్పుగా తీసుకున్నట్లు గుర్తించారు. అప్పు విషయంలో లావణ్యకు, రాజేశ్వరికి మధ్య గొడవలు జరిగాయి. పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా రాజేశ్వరిని ఈ నెల 5వ తేదీన లావణ్య, ఆమె భర్త రవి అలియాస్ రమేష్, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతి హత్య చేశారని తేలింది. ముగ్గురు నిందితులను శనివారం ఉదయం మంథని సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్స్ దుబాసి రమేష్, బాలగాని కిరణ్‌లను ఏసీపీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై20: ఉద్యోగాల కల్పన పేరుతో లోకల్ యాప్‌లో ప్రకటనలు ఇచ్చి సైబర్ మోసాలకు పాల్పడిన ఐదుగురు అంతర్ రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన దూస రమ్య ఉద్యోగం కోసం లోకల్ యాప్‌లో ప్రకటన చూసి ఫోన్ నంబరులో సంప్రదించింది. రూ.400 చెల్లించాలనడంతో ఫోన్ పే ద్వారా పంపింది. అనంతరం ఆమెకు ఫోన్ చేసిన నిందితులు జాబ్ వచ్చిందని ఐడీ క్రియేషన్ కోసం రూ.5 వేలు చెల్లించాలని నమ్మించారు. వెంటనే బాధితురాలు డబ్బు పంపింది. ఉద్యోగం ఎప్పుడు ఇస్తారని బాధితురాలు ఫోన్‌చేయగా మళ్లీ రూ.5 వేలు చెల్లించాలనడంతో పంపింది. ఆ తర్వాత ఆ ఫోన్ నంబరు రెస్పాన్స్‌లో లేకపోవడంతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం ద్వారా విచారణ చేపట్టగా సైబర్ మోసం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా శారదానగర్‌లో ఎర్రబద్ది గోపి (31), సోమందేపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కురుబా అశోక్‌కుమార్ (18), కురుబా వరలక్ష్మి (21), బీచ్ అగ్నిపల్లికి చెందిన ఎం. బ్రహ్మేంద్ర (19), పుట్టపర్తి సత్యసాయి జిల్లా పరిగి మండలంలోని సెయ్యపల్లి గ్రామానికి చెందిన ఎం.స్వాతి సంజీవప్ప (19)ను రిమాండ్‌కు తరలించారు. ఎర్రబద్ది గోపి అనే యువకుడు ట్రాన్స్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ అనే కంపెనీ పేరుతో అనంతపూర్ జిల్లాలో లోకల్‌యాప్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటనలు ఇచ్చాడు. దీంతో అదే కంపెనీలో పనిచేస్తున్న అశోక్, వరలక్ష్మి, బ్రహ్మేంద్ర, స్వాతి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఆ తర్వాత కమీ షన్ వస్తుందని చెప్పి వారికి ఐడీ కార్డులు ఇచ్చి నిరు ద్యోగులను చేర్పించాలని చెప్పాడు. వారి ద్వారా అదేపనిగా మల్టీ లెవల్ మార్కెటింగ్ విధానంలో కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి తెలంగాణ, ఏపీలో సైబర్ మోసాలకు పాల్పడ్డాడు. ఈ కంపెనీపై 10 ఫిర్యాదులు ఉన్నాయని, నిందితుల వద్ద ల్యాప్‌టాప్, ఐదు మొబైల్స్, బ్యాంక్ అకౌంట్స్ సీజ్ చేశామని ఎస్పీ వివరించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం



అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్ లీగల్, జూలై 20: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాసిక్యూటర్ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు ప్రాసిక్యూటర్లకు వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. నిందితులకు శిక్షలు పడేలా దృష్టి సారించాలని ఆయన ప్రాసిక్యూటర్లకు సూచించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు కొత్త చట్టాల గురించి వివరించారు. ఇటీవల కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయిన వసంత, మంథని నుంచి మెట్‌పల్లికి బదిలీ అయిన ప్రణయ్‌లను సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, శరత్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన

- రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు రోజుల్లో 11సెంటీమీటర్ల వర్షపాతం
- వరదతో నిండిన ఫైవింక్లయిన్ మోరీ రహదారి


గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం


సుల్తానాబాద్‌లోని చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రావణ్‌కుమార్


వరదనీటిని మళ్లిస్తున్న సుల్తానాబాద్ మున్సిపల్ సిబ్బంది

కళ్యాణ్‌నగర్, జూలై 20: నాలుగు రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయ్యింది. నాలుగు రోజులుగా 11సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. శనివారం మూడు సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. శుక్రవారం కురిసిన భారీ వర్షంతో 2ఇంక్లైన్, 5ఇంక్లైన్ మోరీలు వరద నీటితో నిండాయి. 2ఏ మోరీ నిండడంతో విధులకు వెళ్లే సింగరేణి కార్మికులతో పాటు మంథని, ముస్త్యాల, సుందిళ్ల, సింగిరెడ్డిపల్లి, దుబ్బపల్లిప్రాంతాలకు వెళ్లే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రామగుండం కార్పొరేషన్‌లోని ప్రధాన కాలువలైన మల్లికార్జున్‌నగర్, మార్కండేయకాలనీ, ఐబీ కాలనీలోని మురికి కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల భూగర్భ డ్రైనేజీలు నిండిపోవడంతో రోడ్లపైకి నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జన సంచారం కూడా తగ్గింది.

ఎలిగేడు: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతోంది. అన్నదాతల ఆశలు చిగురిస్తున్నాయి. రైతులు ఇప్పటివరకు సాగునీటి బావులు ఉన్న రైతులు భూమిని సాగుచేసి వరినాట్లు వేశారు. మిగితా చెరువులు, కుంటల నీటి సౌకర్యం లేక వరినాట్లు వేయలేక పోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో రైతులు దుక్కిని చదును చేస్తున్నారు.

ధర్మారం: మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం స్వల్పంగా వర్షం కురుస్తుండడంతో రోడ్లు బురదమయమాయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు వచ్చారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలతోనైన చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని ఆశించిన రైతులు నిరాశ మిగిలింది.

జూలపల్లి: మండలంలోని అన్నిగ్రామాల్లో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షం కురుస్తుండడంతో మండల రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వర్షాకాలం ప్రారంభంలో అరకొరగా కురిసిన వర్షాలతో నిరాశగా ఉన్నా రైతన్నలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వారిలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. వరి సాగుకోసం సాగునీటి బావులపై ఆధారపడిన కొంత మంది రైతులు నార్లు పోసుకున్నారు. రెండు రోజులుగా మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరినాట్లు వేసుకునేందుకు రైతన్నలు తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ కాలువపై ఆధారపడిన మండలంలోని ఎక్కువ శాతం రైతులు ఎస్సారెస్పీ నిండకపోవడంతో సాగు నీటిపై నిరాశతో ఎదురుచూస్తున్న వారికి ఈ వర్షాలు ఊరటనిస్తున్నాయి.

● వర్షానికి కూలిన గోడ..

కమాన్‌పూర్: మండలంలోని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జూలపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజనర్సు ఇంటి గోడ కూలిపోయింది. దీంతో శనివారం తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఆర్ఐ, కారోబార్ పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు.

● మానేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: మానేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాలను శనివారం ఆయన తన సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు మండలంలో చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులు నీటితో నిండుకోవడంతో పరిస్థితులను అంచనా వేయడం కోసం పలు గ్రామాల్లో ఆయన వరద ఇబ్బందులను పరిశీలించారు. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలైన గొల్లపల్లి, గట్టేపల్లి, బొంతకుంట పల్లి, నీరుకుళ్ల, గట్టేపల్లి, కదంబాపూర్ తదితర గ్రామాల ప్రజలు మానేరులో దిగవద్దని చెరువులు కుంటల్లో చేపల వేట చేయవద్దని సూచించారు. ఇంటి వద్ద పరిసరాల్లో మహిళలు తడిసిన బట్టలు కరెంట్ వైర్లపై ఆరవేయడం, తడిసిన చేతులతో స్విచ్ బోర్డ్లను ముట్టడం వంటివి రైతులు చేయవద్దన్నారు. మరో రెండు, మూడు రోజులు వానలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

● పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

పెద్దపల్లిటౌన్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. వర్షాలతో జరిగిన నష్టాలను శనివారం కమిషనర్ పరిశిలించి మాట్లాడారు. కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో అక్కడక్కడి ఇళ్లు కూలిపోయాయన్నారు. కూలి పోయే దశలో ఉన్న ఇళ్ల నుంచి ఖాళీ చేయాలని సూచించారు. కూలిపోయే ఇళ్లను మున్సిపల్ సిబ్బంది గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలోని పునరావాస కేంద్రానికి తరలించి భోజన సదుపాయం ఇతరత్రా వసతులు కల్పిస్తామన్నారు. రంగంపల్లి రాజీవ్ రహదారి వద్ద కల్వర్టును పరిశీలించి వర్షాల కారణంగా దెబ్బతిన్న పైపులను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఏఈని ఆదేశించారు. పట్టణ ప్రజలకు వర్షాల కారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా సెల్ 6303127484నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అన్ని విధాల సహాయకచర్యలు చేపట్టేందుకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది శంకర్, భూమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

● వర్షాలతో ఇబ్బందులు పడితే అధికారులు స్పందించాలి..

సుల్తానాబాద్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో జలమయం కాగా మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. సుభాష్ నగర్ రోడ్డుపై వరద నీరు నిలిచి ఇళ్లలోకి పోయే అవకాశం ఉండడంతో స్పందించిన చైర్‌పర్సన్ వెంటనే అధికారులను అప్రమత్తం చేసి మున్సిపల్ సిబ్బందితో వరద నీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. దాంతో ముప్పు తప్పింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మూలంగా ఇళ్లలోకి నీరు వెళితే తక్షణమే తమకు సమాచారం అందించాలని, అలాగే రోడ్లపై నీరు నిలిచినా తెలపాలని ప్రజలకు సూచించారు. వర్షాల మూలంగా రోడ్లపై గుంతలను గమనిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని, విద్యుత్ స్తంభాల వద్ద కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇనుప స్తంభాలు ఉన్నచోట వాటిని తాకవద్దని అన్నారు. వరదతో ఏర్పడే సమస్యలను ముందస్తుగా గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. శిథిలవస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ ఉండవద్దని అవి వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కమిషనర్ కట్ట వేణుమాధవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రాకండి

- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూలై 20: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. వర్షాల సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 100నెంబర్‌కు ఫోన్ చేస్తే సహాయం అందిస్తారన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత దృష్ట్యా పర్యాటక ప్రాంతాలు, డ్యాంల సందర్శనలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని, అక్కడికి ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, రిజర్వాయర్లు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని, విద్యుత్ స్థంబాలను, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోరాదన్నారు. డ్యాములకు వరద నీరు వస్తున్నందున చేపల వేటకు వెళ్లవద్దని, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్లపై వరద వచ్చినా, రోడ్డు తెగిపోయినా అక్కడికి గ్రామ ప్రజలు వెళ్లకుండా రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారికేట్లు, ఫెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి, అందులో నీరు నిలిచి, ఆ గుంతలు కనబడక ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిని వాహనదారులు గమనించాలన్నారు. వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వంతెనలను దాటడానికి సాహసం చేయవద్దని సూచించారు.


జూలపల్లిలో కూలిన గోడను పరిశీలిస్తున్న తహసీల్దార్


పెద్దపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సమస్యల సత్వర పరిష్కారానికే విద్యుత్ ప్రజావాణి

పెద్దపల్లిటౌన్, జూలై 20: విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకార్యక్రమాన్ని టీజీఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిటౌన్, జూలై 20: వర్షాకాలంలో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో శనివారం చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రైన్ కోట్స్ గ్లౌజులు, కాళ్లకు బూట్లు తప్పనిసరి ధరించాలని సూచించారు. డ్రైనేజీలో మురుగు నీరు నిల్వ కాకుండా చూసుకోవాలన్నారు. పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు చెత్తను ఎప్పటికప్పుడు సేకరించాలని ఆమె పేర్కొన్నారు. ప్రధానంగా వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వల్లో బ్లీచింగ్ చల్లాలని, దోమలు ఉన్న ప్రాంతాలను గుర్తించి ఫాగింగ్ చేయాలని సూచించారు. ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, మురుగు నీరు నిల్వ ఉంటే యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆమె ఆదేశించారు. పట్టణంలోని జెండా చౌరస్తా, మజీద్ ఏరియా మరియు మినీ ట్యాంక్ బండ్ వద్ద శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షాహిదా సాబీర్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు పాల్గొన్నారు

వైద్య విద్యార్థుల ఇంటింటి సర్వే


జూలపల్లిలో సర్వే చేస్తున్న వైద్య విద్యార్థులు

కమాన్‌పూర్, జూలై 20 : మండలంలోని జూలపల్లి గ్రామంలో శనివారం రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులు ఇన్‌చార్జి హెచ్‌వోడీ శ్రీదేవి, డాక్టర్ కావ్యరాసన్, పి.రవీందర్, టీ. నాగరాజుల పర్యవేక్షణలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా ఇంతకు ముందు దత్తత తీసుకున్న కుటుంబాల నుంచి వయస్సుల వారీగా జనాభా సేకరణ, రక్తపోటు, మధుమేహం ఉన్న వారి గురించి, ఐదు సంవత్సరాలలోపు పిల్లల ఆరోగ్య వివరాలు సర్వేలో సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గంగాదేవి బోనాలు

మంథని, జూలై 20: గంగపుత్రుల కుల దైవం గంగాదేవి బోనాల జాతరను మంథనిలో ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అంబటి సతీష్, గంధం వెంకటస్వామి, బోయిని నారాయణ, అంబటి కుమార్, అంకరి శివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బోయినపేట నుంచి గోదావరి తీరం వరకు బోనాలు ఎత్తుకొని ర్యాలీగా వెళ్లి గోదావరి తీరంలో బోనాలు సమర్పించుకుంటామన్నారు. మంథని నియోజకవర్గంలోని గంగపుత్రులు పెద్ద ఎత్తున బోనాల జాతరకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మనాలి ఠాకూర్

పాలకుర్తి, జూలై 20: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. శనివారం మండలం పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ మహిళలు ఆయా రంగాల్లో నైపుణ్యాన్ని సాధించి నిలదొక్కుకోవాలన్నారు. తమ సేవా సమితి ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మత్తడిని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి'


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌సంఘం నాయకులు


జూలపల్లి, జూలై 20: జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో గల ఊరచెరువు మత్తడిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం వడుకాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు తహసీల్దార్ బషీరొద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేపల వృత్తినే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్నామన్నారు. ఊర చెరువు మత్తడిని ధ్వంసం చేయడం వల్ల తాము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే పరిస్థితులు దాపురించాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఊరచెరువు మత్తడిని కూల్చి తమ ఉపాధిని దెబ్బతీసిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఊరచెరువు మత్తడిని పునర్ నిర్మాణం చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కనకట్ల స్వామి, జెట్టి సతీష్, తీగల రమేష్, కనకట్ల శ్రీనివాస్, జెట్టి వెంకటేశం, కనకట్ల అంజి, దావెల్లి రాజయ్య, చిక్కుడు స్వామి, కనకట్ల లచ్చయ్య, కనకట్ల శంకరయ్య, కనకట్ల కొండయ్య, కనకట్ల కుమార్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

'శ్రీవాణి'లో గురు పౌర్ణమి

ఫైవింక్లయిన్‌కాలనీ, జూలై 20: శ్రీవాణి హైస్కూల్‌లో శనివారం గురు పౌర్ణమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువుల విశిష్టతను తెలియజెప్పేలా విద్యార్థులు శ్లోకాలను ఆలపించారు. అనంతరం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మంగపేటలో వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్, జూలై 20: డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగపేట గ్రామంలో శనివారం వైద్య శిబిరం జరిగింది. గ్రామస్థులకు డాక్టర్ భావన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనిగ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో లక్ష్మణ్, ఏఎన్ఎం శైలజ, ఆశావర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.



కార్మికుల ప్రాణాలంటే లెక్కలేని యాజమాన్యం

మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జూలై 20: సింగరేణి కార్మికుల ప్రాణాలంటే యాజమాన్యంకు విలువ లేదని, ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదని మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏ ప్రమాదంలో ఇప్పటి వరకు ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే సూపర్‌వైజర్లను బాధ్యులను చేస్తుందని, ప్రమాదానికి గురైన కార్మికులపైన చార్జిషీట్లు, సస్పెండ్లు అంటూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఎల్లో కార్డు, రెడ్ కార్డ్ అంటూ కార్మికులను బాధ్యులను చేస్తున్న కుట్రలను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. డీజీఎంఎస్ అధికారులు కూడా తుతు మంత్రంగా విచారణలు చేస్తూ ఓవర్‌మెన్లకు, సర్దార్లకు శిక్షలు విధిస్తూ చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. సింగరేణి సాధించిన ఉత్పత్తి లాభాలకు తామే కారణమని చెప్పుకునే అధికారులు ప్రమాదాలకు తామే కారణమని ఎందుకు చెప్పుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ సిబ్బందిపై పని భారం పెరగడంతో మానసిక ఒత్తిడికి గురై వివిధ రోగాల భారిన పడుతున్నారని, ఓవర్‌మెన్లపై, సర్దార్లపై పని భారం తగ్గించాలని, మైనింగ్ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ సిబ్బందిని పెంచి రక్షణ విభాగం, ఉత్పత్తి విభాగం ఏర్పాటు చేసి ఎవరి పనులను వారికి కేటాయించాలని, ఎల్లో కార్డు, రెడ్ కార్డు విధానాన్ని రద్దుచేయాలని హెచ్చరించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు పేరుకే కార్మిక సంఘాలని, అధికారుల వైపు కాకుండా కార్మికుల పక్షాన నిలబడి కార్మికులపై పెరుగుతున్న పని భారంపై పోరాటం చేయాలని సూచించారు.

ఆర్జీ-3లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, జూలై 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో శనివారం క్వార్టర్స్ కౌన్సెలింగ్‌ను చేపట్టారు. మొత్తం 186 ఖాళీ క్వార్టర్స్‌లో నూతన, అలాట్మెంట్, చేంజ్‌ఆఫ్ క్వార్టర్స్ కోసం 86మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 24 మంది ఉద్యోగులు హాజరైయ్యారు. ఈ కౌన్సెలింగ్‌లో 23 మంది ఉద్యోగులు తమ క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో అధికారులు సత్యనారాయణ, ముప్పిడి రవీందర్‌రెడ్డి, సునీల్‌ప్రసాద్, మతీన్ హాస్సేన్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

గోదావరిఖని, జూలై 20: స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోలేటి సత్తెమ్మతో పాటు మరో ఇద్దరు కార్మికులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం రాత్రి పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారికి సరైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ కిరణ్‌రాజ్‌కు సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, ఉన్ని కృష్ణణ్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

కోల్‌సిటీటౌన్, జూలై 20: రామగుండం కార్పొరేషన్ 38వ డివిజన్‌లోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ నిర్వాహకురాలు జి రజిత చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. భవిష్యత్‌లో పిల్లలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా అరుణ పాల్గొన్నారు.

రాజాపూర్ యాదవ సంఘం కార్యవర్గం

రామగిరి, జూలై 20: మండలంలోని రాజాపూర్ గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం గ్రామంలో జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా పాశం కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా కాల్వ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం యాదవ సంఘం నాయకులు మొగిళి లింగయ్య, నూనేటి పోచమల్లులు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవం

గోదావరిఖని జూలై 20: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సింగరేణి అధికారుల బంగ్లాస్ ఏరియాలోని దుర్గాదేవి ఆలయంలో శనివారం శాకాంబరి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించగా శాకంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్‌జీ-1 సేవా సమితి అధ్యక్షురాలు చింతల లక్ష్మీశ్రీనివాసు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం లలిత సహస్ర నామాలు పారాయణం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ జనరల్ మేనేజర్ల సతీమణులు మాలతీసూర్యనారాయణ, కృష్ణవేణి, చిలక లక్ష్మీశ్రీనివాస్, బీనాసింగ్, లేడీస్ క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

ఫైవింక్లయిన్‌కాలనీ, జూలై 20: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. అడిషనల్ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల దశలోనే రాజ్యాంగం, చట్టాలపై అవగాహన కలిగేలా పుస్తకాలు చదవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా ఎదిగేలా మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, మంచి స్నేహాలు, అలవాట్లతో విద్యార్థి భవిష్యత్తు ముడిపడి ఉంటుందని అన్నారు. లక్ష్యం ఏర్పరచుకుని శ్రమిస్తే విజయం సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దని సూచించారు. అనంతరం ఖని ఏసీపీ ఎం రమేష్ మాట్లాడారు. సైబర్ క్రైం, ర్యాగింగ్, గంజాయి, వరకట్నం, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అఫీషియేటింగ్ డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, గోదావరిఖని బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ టీ సతీష్, న్యాయవాదులు శైలజ, శ్రీనివాస్, భూమయ్య, అనురాధ, సురేష్, చరణ్‌రెడ్డి, హెచ్‌ఎం సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన పాటించాలి: ఎస్ఐ

కాల్వ శ్రీరాంపూర్, జూలై 20: మండలంలోని ఇప్పలపల్లి గ్రామపరిధిలో గల క్రిసెంట్ ఉన్నత పాఠశాలలో శనివారం కంప్యూటర్ ల్యాబ్, వన మహోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ఓంకార్ యాదవ్, క్రిసెంట్ పాఠశాలల సీఈవో సయ్యద్ తహబిలాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదవి, తల్లిదండ్రులు ఆకాంక్షలను నెరవేర్చాలని, సమాజంలో క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగించాలని, సెల్‌ఫోన్‌ను ఉపయోగించడం తగ్గించాలన్నారు. సీఈఓ సయ్యద్ తహబిలాల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ నైపుణ్యాలు అవసరమని, అందుకే కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్ నసీర్, ఎండీ జాఫర్, ఉపాధ్యాయులు రాజవీర్, షరీఫ్‌ఆలీ, నాజీమ్, కృష్ణ, పద్మజ, ఫర్హాన పాల్గొన్నారు.

సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం

ఓదెల, జూలై 20: సదాశాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైకుంఠధామం వద్ద శనివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి, స్పెషల్ అధికారి భాస్కర్, విద్యుత్ ఏఈ, అల్లం సతీష్, దాసరి కోటి, నాగపురి రవి, క్యాతం మల్లేశం, మేర్గు సారంగం, సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలు బే ఖాతర్

- నేటికీ ఏర్పాటు చేయని ట్రీ గార్డులు

పెద్దపల్లి రూరల్, జూలై 20: మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కొన్ని రోజుల క్రితం పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో అత్యంత ఆర్భాటంగా 75వ వనమహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. భాధ్యతయుతంగా మంత్రి అధికారులకు ఆదేశాలిస్తూ నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రోజులు గడుస్తున్నప్పటికి నాటిన మొక్కలకు ఏ అధికారి కూడ కన్నెత్తి చూడకుండా పోగా మంత్రి ఆదేశానుసారం కనీసం ట్రీ గార్డులను కూడ ఏర్పాటు చేయలేదు.


ట్రీ గార్డులు ఏర్పాటు చేయని మొక్కలు